క్లుప్తంగా

ఆదిత్య గణపతికి సహస్ర దీపాలంకరణ


ఆదిత్య గణపతి ఎదుట సహస్ర దీపాలంకరణ

అల్లిపురం : నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం రాత్రి గణపతికి సహస్ర దీపాలకంరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. శనివారం మహానిమజ్జన యాత్ర అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఎం సహాయ నిధికి 'ఐలా' విరాళం


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న ఐలా సంస్థ చైర్మన్ జగపతిరాజు

మహారాణిపేట: ముఖ్యమంత్రి సహాయ నిధికి కంచరపాలెంలోని ఐలా (ఐఏఎల్ఏ) సంస్థ చైర్మన్ జగపతిరాజు రూ.50 వేల చెక్కును కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదల నేపథ్యంలో బాధితుల సహాయార్థం రూ.25 వేలు చెక్కు, మరో రూ.25 వేల విలువ గల రొట్టెలు, బిస్కెట్లను జిల్లా యంత్రాంగానికి ఇదివరకు అందించామన్నారు. దీంతో ఒక లక్ష రూపాయలు తమ సంస్థ నుంచి విరాళంగా అందజేశామని కలెక్టర్‌కు ఐలా చైర్మన్ తెలిపారు.

గణపతి సన్నిధిలో కుంకుమ పూజలు


దీపారాధనలో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి భక్తులు స్వామి సన్నిధిలో దీపారాధన చేశారు. తొమ్మిది రూపాలు కలిగిన గణపతులను ఏర్పాటు చేసి వాటి వద్ద దీపాలు వెలిగించారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ఆశ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఆశ కార్యకర్తల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సమావేశం ప్రతి 3 నెలలకు ఒకసారి జరుగుతుందని తెలిపారు. ఆశ కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు డీఎంహెచ్‌వోకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, వివిధ విభాగాల అధికారులు ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, బి.నాగభూషణం, శశిభూషణ్, మణికుమారి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పాలన — మాటలే.. చేతల్లేవ్..

- కూటమి పాలనలో అన్నీ వైఫల్యాలే
- రోడ్లు, కాలువలు బాగులేవు
- ఇచ్చిన హామీలు అమలు కాలేదు
- బాబు పాలనపై సామాన్యుల పెదవి విరుపు

ఎన్నికలకు ముందు హామీలు గుప్పించిన కూటమి నాయకులు గెలిచాక ముఖం చాటేస్తున్నారు. సూపర్ సిక్స్ అంటూ గొప్పలకు పోయిన నాయకులు వాటి అమలులో చిత్తశుద్ధి చూపలేకపోయారు. దాంతో ప్రజలు ప్రస్తుత ప్రభుత్వం తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంద రోజులు అవుతున్నా తమకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం తగదని వాపోతున్నారు.


కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఇదీ పరిస్థితి (వంద రోజుల పాలనలో)


75 ఫీట్ రోడ్డు రామకృష్ణా జంక్షన్ వద్ద వర్షం వస్తే ఇదీ పరిస్థితి (వంద రోజుల పాలనలో)


ఫిషింగ్ హార్బర్ రోడ్డులో మురుగు తొలగించేందుకు పారిశుధ్య కార్మికుల తంటాలు (ఇక్కడ ఇది సాధారణమే)

దాబాగార్డెన్స్, జగదాంబ, అల్లిపురం, సీతమ్మధార:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులైనా ఎక్కడా ఒక్క అంగుళం అభివృద్ధి కానరాలేదు. రోడ్లు అధ్వానంగా మారాయి. గత ప్రభుత్వం పాతనగర ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 60 అడుగుల రోడ్డు విస్తరణ ముగింపు పనులు కూడా చేపట్టలేకపోయింది. ఎన్నికల ముందు కూటమి నేతలు ఎన్నో హామీలిచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనన్నారు.. చెత్త రహిత నియోజకవర్గమన్నారు.. సమస్యలే లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. పాత పాతనగరంలో రైతు బజారు ఏర్పాటు చేస్తామన్నారు. పోర్టు కాలుష్యం సమస్య తీరుస్తామన్నారు. ఒక్కటీ అమలు కాలేదు. నియోజకవర్గ ఎమ్మెల్యేని పక్కన పెడితే.. వార్డుల్లో కార్పొరేటర్లు కూడా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఏ సమస్యా పరిష్కారం కావడంలేదు. కార్పొరేటర్లు వార్డుల్లో తిరిగి సమస్యలు అడిగే రోజులు పోయాయి.

సమస్యల వలయంలో వార్డులు..

నియోజకవర్గ పరిధి అన్ని వార్డుల్లో సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. 29వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. 30వ వార్డులో ఎక్కడ చూసినా దోమల స్వైరవిహారమే. ఫలితంగా వార్డులో విషజ్వరాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడి కార్పొరేటర్ గత ఐదారు నెలలుగా వార్డు పరిధిలో పర్యటించిన పాపాన పోలేదు.వార్డు బాయ్ లేన్‌లో తాగునీటి సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నా స్థానిక కార్పొరేటర్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానిక మహిళలు సాక్షి వద్ద వాపోయారు. 31వ వార్డులో ప్రధానంగా ట్రాఫిక్ సమస్యతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనకలదిబ్బ, చాకలిపేట, సూర్యాబాగ్, విశ్వనాథ్ జంక్షన్, ఆర్టీ క్లబ్ తదితర ప్రాంతాల్లో అపారిశుధ్యం కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. అలాగే 32, 33, 34, 35, 36, 37, 38, 39, 41 వార్డుల్లో సమస్యలు కోకొల్లలు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఆయా వార్డులో గట్టిగా వినిపిస్తున్నాయి.

ఇదేం ప్రభుత్వం..



ఇది చెత్త ప్రభుత్వం. కనీసం తాగాడానికి మంచినీరు కూడా ఇవ్వలేని స్థితిలో ఉంది. మా ప్రాంతంలో ఉండే వారంతా పేద, బడుగు, బలహీన వర్గాల వారే. ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మా ప్రాంతంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. సన్నటి ధారతో అరగంట పాటు సరఫరా చేస్తున్నారు. మా ప్రాంతంలో సుమారుగా 30 నుంచి 40 ఇల్లులు ఉంటాయి. కనీసం తాగేందుకు కూడా నీళ్ల ఇవ్వలేకపోతున్నారు.
– దైవకుమారి, వార్డుభాయ్ లేన్, 30వ వార్డు

నియోజకవర్గంలో సమస్యల తిష్ట..



నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. కాల్వల్లో మురుగు నీటి ప్రవాహం సరిగ్గా లేక దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పూడ్చకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన తుస్సుమంది.
– సారిక దైవకుమార్, ఆశిపాపవీధి, 36వ వార్డు

పథకాల జాడే లేదు..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచిపోయాయి. కానీ ఒక్కటంటే ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో 99 శాతం హామీలు నెరవేర్చారు. ఉచిత బస్సు, ఏడాదికి మూడు సిలిండర్లు, 50 నిండిన వారికి పెన్షన్లు ఇస్తామన్నా వాటి జాడే కనిపించడం లేదు.
– నీలాపు సర్వేశ్వరరెడ్డి, దొండపర్తి

మూడు సిలిండర్లు ఏమయ్యాయి?



ప్రతి ఇంటికి కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైందని పండగ చేసుకుంటున్నారు. అప్పుడు హామీలతో ఊదరగొట్టేసిన నాయకులు ఇప్పుడు మరిచిపోయారు. పేదలంతా గ్యాస్ సిలిండర్లు ఎప్పుడిస్తారా అని ఎదురుచూస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇంత మోసం చేస్తారని అనుకోలేదు.
– బంద సూర్యలక్ష్మీరాణి, అల్లిపురం

నిరుద్యోగ భృతి ఇస్తారో లేదో!



నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయింది. కానీ ఇప్పటికీ నిరుద్యోగ భృతి కోసం మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియటం లేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఐదేళ్లు గడిపేసింది. ఇప్పటికే 31 సంవత్సరాలు వచ్చేసాయి. ఉపాధి కల్పన లేక బాధ పడుతున్నాను.
– ఏనుగుపల్లి పవన్‌కుమార్, అల్లిపురం

ప్రజలు తిరగబడే రోజులొస్తాయి..



ఓట్లు వేసి మోసం చేసినందుకు ప్రజలు తిరగబడే రోజులు వస్తాయి. ఏ హామీలైతే ఇచ్చారో వాటి అమలుకు జనం రోడ్లెక్కే పరిస్థితి వస్తుంది. ఈ పరిణామాన్ని కూటమి ప్రభుత్వం చవిచూడాల్సిందే. వంద రోజులవుతున్నా ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయడంలేదు. కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తోంది.
– వాసర్ల సుబ్రహ్మణ్యం, దుర్గమాంబ సమాజం

సూపర్ సిక్స్ మరిచిపోవాలనే టీడీపీ కొత్త డ్రామా

- చంద్రబాబు 100 రోజుల పాలన జీరో
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి


మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలు మరచిపోవాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిపై సీఎం చంద్రబాబు బురద జల్లుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పవిత్రమైన రాజకీయ ప్రయాణం నేటితో నాలుగేళ్లు గడిచిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు వంద రోజుల పాలన పూర్తిగా శూన్యమన్నారు. చివరకు శ్రీవారి లడ్డూపై కూడా దుష్ప్రచారం సిగ్గు చేటన్నారు. తాను నమ్మే దైవత్వం కలిగిన గొప్ప మనిషి వైవీ అన్నారు. సరీస్ మైండ్, దైవమంటే పూర్తి నమ్మకం ఉన్న వైవీపై లోకేష్ నిందలపై ఛాలెంజ్‌కి తాము సిద్ధమన్నారు. 2025 జమిలీ ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్ గెలవడం ఖాయమన్నారు. రోడ్లపై పడుకుని మరీ టీడీపీని గెలిపించిన పవన్‌కల్యాణ్ చంద్రబాబు కుటిల రాజకీయాలకు బలికాక తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి వైఎస్సార్‌సీపీలో చేరి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పలు వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డెన్ ప్రసాద్‌రావును విధుల నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అల్లిపురం : తన తప్పులు ఎత్తి చూపిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వార్డెన్ ఆర్.ప్రసాదరావుని విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీను, యు.నాగరాజు డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. సీతమ్మధారలో గల చిన్నపిల్లల హాస్టల్ నంబరు 2లో ఈ నెల 9వ తేదీన విద్యార్థులతో మరుగుదొడ్లు కడిగిస్తున్న కొన్ని ఫొటోలు ఏఐఎస్ఎఫ్ దృష్టికి రావటంతో విషయాన్ని ఏఎస్‌డబ్ల్యువో శ్యామలకు తెలియపరిచామన్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ హరేందిరప్రసాద్ వార్డెన్ ప్రసాదరావును సస్పెండ్ చేసి, వర్కర్ అప్పారావుని విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఈ నేపథ్యంలో తప్పు అంగీకరించాల్సిన ప్రసాదరావు ప్రెస్‌మీట్ పెట్టి ఏఐఎస్ఎఫ్ నాయకులు తనని డబ్బులు అడిగారని, తాను డబ్బులు ఇవ్వకపోవటం వల్ల కుట్రపూరితంగా తనను సస్పెండ్ చేయించారన్న అంశాన్ని తాము పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కిరణ్, ప్రవీణ్‌కుమార్, గ్రేస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన మంచి తెలియజేయడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

సీతమ్మధార : వంద రోజుల ప్రభుత్వ పాలనలో చేసిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా వేదిక ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. 27వ వార్డు దొండపర్తిలోని నెహ్రూబజారు వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుస్తున్న ప్రభుత్వం అని కొనియాడారు. మెగా డీఎస్సీ, ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్న ప్రభుత్వం ఇది అన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ సెక్రటరీ డి.కీర్తి, జోన్-3 , కమిషనర్ శివప్రసాద్, సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ వీరారావు (బుజ్జి), జనసేన సౌత్ ఇన్‌చార్జి శివప్రసాద్‌రెడ్డి, 27వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, చంటి తదితరులు పాల్గొన్నారు.


మలయాళంలో గురజాడ సాహిత్యం

సీతంపేట: గురజాడ అప్పారావు సాహిత్యాన్ని 'గురజాడ కథామంజరి' పేరిట మలయాళ భాషలోకి నగరానికి చెందిన ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి అనువదించారు. మలయాళ భాషలోకి అనువదించిన గురజాడ అప్పారావు తొలి సాహిత్యం ఇదే కావడం విశేషం. ఇందులో గురజాడ రచించిన ఆరు కథలతో పాటు, దేశభక్తి గేయం ఉంది. గురజాడ సాహిత్యంపై ప్రముఖ రచయితలు విహారి, వివినమూర్తి, చాగంటి తులసి, అట్టాడ అప్పలనాయుడు, కె.పి. శివకుమార్, డాక్టర్ ఎన్.రజని, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య కిన్నెర శ్రీదేవి, కిరణ్ ప్రభల వ్యాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథాన్ని ప్రముఖ రచయిత రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తెలుగులో ముద్రించారు.

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీవోఈ) ఎంఏ (ఇంగ్లిష్), బి.ఎ., బి.కాం. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి గడువును పొడిగించినట్లు డైరెక్టర్ డా.టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచే దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశం దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు వెల్లడించారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15లోపు అందజేయాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం https:// cdl. gitam. edu/ Welcome. aspx ను సందర్శించాలని సూచించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి తీరని లోటు

అల్లిపురం : సీతారాం ఏచూరి మరణం సీపీఎంకే కాకుండా దేశానికి, ప్రపంచ కమ్యూనిస్ట్ ఉద్యమానికి, కార్మిక వర్గానికి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యాక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు సీహెచ్ నరసింగరావు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ సీరా సతీష్, సీపీఐఎంఎల్ ప్రజాపోర్ జిల్లా కార్యదర్శి దేవ, గణేష్‌పండా, బొడ్డు కళ్యాణరావు, ఎ.అశోక్ , సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.గంగారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.పద్మ, బి.ఈశ్వరమ్మ, శ్రీనివాస్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ డిపోలు వద్దు

మహారాణిపేట: జిల్లాలో కొత్తగా రేషన్ డిపోలు ఏర్పాటు చేయవద్దని, ప్రస్తుతం ఉన్నవే సర్దుబాటు చేయాలని జిల్లా చౌకధరల దుకాణ డీలర్ల సంఘాలు వేర్వేరుగా కోరారు. శుక్రవారం ఈ సంఘాలు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఎస్‌వో సూర్యప్రకాశరావుకు వినతి పత్రాలు సమర్పించారు. కొత్తగా 61 డిపోలు ఏర్పాటు చేస్తే తాము ఇబ్బంది పడతామన్న అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు జిల్లా సంఘం అధ్యక్షుడు పి.చిట్టిరాజు తెలిపారు.

యునెస్కో సదస్సుకు ఇంటాక్ కన్వీనర్


డా.రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: యునెస్కో, జీఎస్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ (ఇంటాక్) విశాఖ చాప్టర్ కన్వీనర్, జియో హెరిటేజ్ అడ్వైజర్ డి.రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఢిల్లీలోని యునెస్కో హౌస్‌లో సెప్టెంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు 'ఫస్ట్ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కమ్ వర్క్‌షాప్ ఆన్ యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్'జరగనుంది. ఈ సందర్భంగా జరిగే చర్చావేదికలో జియోపార్క్‌ల మూలాలు అనే అంశంపై ప్రసంగించేందుకు రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. మొదటి రెండు రోజులు వర్క్‌షాప్ జరుగుతుందనీ.. చివరి రోజున రాజస్థాన్‌లో క్షేత్ర స్థాయి పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. భారత్‌లో గ్లోబల్ జియోపార్క్‌లు ఏర్పాటు చేసేందుకు యునెస్కో తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమని.. ఈ వర్క్‌షాప్‌కు ఆహ్వానం లభించడం సంతోషంగా ఉందని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

సమష్టి కృషితోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట


మాట్లాడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళీకృష్ణ

మహారాణిపేట : బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టేందుకు సమష్టి కృషి అవసరమని యునిసెఫ్ ప్రతినిధులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నత స్థాయి అధికారులు అభిప్రాయపడ్డారు. మన రాష్ట్రంలోనే బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ పరిణామం విచారకరమని పేర్కొన్నారు. కిశోర వికాసం అనే అంశంపై శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రాంతీయ స్థాయి వర్క్‌షాప్ జరిగింది.

ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు యునిసెఫ్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మురళీకృష్ణ, యునిసెఫ్ ప్రతినిధులు కాశీనాథ్, మేరీ జొనెస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి. చిన్నయిదేవి పాల్గొని వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కౌమార దశలోకి వచ్చే బాలికలతో ప్రత్యేకంగా మాట్లాడాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలపై, వివాహ జీవితంపై పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లి ఇప్పుడున్న పరిస్థితులను మార్చాలన్నారు. ఫోన్ ప్రభావం, సహజీవన విధానం, టీనేజీ ప్రెగ్నెన్సీ, స్కూల్స్ డ్రాపౌట్స్ రేటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అందరి సలహాలు, సూచనలు స్వీకరించారు.

స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ రీజనల్ వర్క్ షాప్‌లో వివిధ జిల్లాల ఐసీడీఎస్ పీడీలు, సీడీపీవోలు, ఏసీడీపీవోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యం నిర్దేశించుకోవాలి


సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని సత్కరిస్తున్న అతిథులు

అల్లిపురం : విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శ్రీ నవోదయ జూనియర్ కళాశాల నిర్వహించిన కాలేజీ ఫెస్ట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం సీపీని సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బీఆర్ఎస్ నారాయణ, నవోదయ జూనియర్ కాలేజీ డీన్ భీశెట్టి మురళీ ప్రకాష్, డైరెక్టర్ విశ్వకీర్తి, ప్రిన్సిపాల్ మైకేల్ జాన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం


కొత్త, పాత జెడ్సీలు రాము, కృష్ణలను సత్కరిస్తున్న జోనల్ అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోనల్ కార్యాలయ సిబ్బంది అందరం సమష్టిగా పనిచేద్దామని జోన్-5 నూతన కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శుక్రవారం జెడ్సీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ పరిధిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ఆయా శాఖల అధికారులు జెడ్సీ రామును సత్కరించారు. అనంతరం పాత జెడ్సీ ఆర్.జి.వి.కృష్ణకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ కమిషనర్ బాబూరావు, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కె.వెంకటరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏడుకొండలు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.